



నేడు, రేపు చంద్రబాబు పర్యటన

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

టిడిపి అధినేత నారా చంద్రబాబుని నాయుడు విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ఈనెల 8,9 తేదీల్లో పర్యటన షెడ్యూల్ సోమవారం ఖరారైంది. ఈనెల 8న రాత్రి 10గంటలకు విజయనగరం జిల్లా చేరుకుని అశోక్ బంగ్లాలో బసచేస్తారు. 9న బుధవారం ఉదయం 10గంటలకు రోడ్డు ప్రయాణంలో బొబ్బిలి, సీతానగరం, పార్వతీపురం పట్టణం మీదుగా గరుగుబిల్లి మండలంలోని సర్దార్ గౌతులచ్చన్న తోటపల్లి బ్యారేజ్ సందర్శిస్తారు. అనంతరం మధ్యాహ్నం 1గంకు తోటపల్లిలో జరిగే ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకల్లో పాల్గొంటారు. 2.30 ని.లకు ఎర్రన్నగుడి కూడలిలో జరిగే బహిరంగ సభలో ప్రసంగిస్తారు. 4.30 గంటలకు కొత్తవలస మీదుగా పార్వతీపురం పాత బస్టాండ్ వరకు రోడ్షో చేస్తారు. అనంతరం అక్కడ సభలో ప్రసంగిస్తారు. అనంతరం జూనియర్ కళాశాల మైదానం లో రాత్రి బసచేస్తారు. మరుసటి రోజు ఉదయం శ్రీకాకుళం జిల్లాకు వెళ్తారు.



ఎన్నికలు దగ్గర పడుతుండడంతో ఉమ్మడి విజయనగరం జిల్లాలో వైసిపిలో చీలికలు మొదలయ్యాయి. ఇతర పార్టీల్లోకి వెళ్లకపోయినప్పటికీ పలు నియోజకవర్గాల్లో గ్రూపు రాజకీయాలు తారా స్థాయికి చేరాయి. పార్టీ జిల్లా నేత చక్కదిద్దేందుకు ప్రయత్నిస్తున్నప్పటికీ అసంతృప్తి జ్వాలలు చల్లారడం లేదు. భవిష్యత్తులో తారా స్థాయికి చేరే పరిస్థితులు కనిపిస్తున్నాయని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా శృంగవరపుకోట, నెల్లిమర్ల, సాలూరు నియోజకవర్గాల్లో చోటు చేసుకుంటున్న పరిణామాలు చర్చనీయాంశంగా మారాయి.

- సాలూరులో అనైక్యత
- ఎస్.కోటలో ఆధిపత్య పోరు
- ముదిరి పాకాన పడిన నెల్లిమర్ల వివాదం

వైసిపిలో చీలికలు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

నెల్లిమర్ల నియోజకవర్గంలో స్థానిక ఎమ్మెల్యే వ్యవహారశైలిని నిరసిస్తూ నెల్లిమర్ల ఎంపిపి అంబల్ల సుధారాణి తన పదవికి రాజీనామా చేస్తూ పార్టీకి అందజేశారు. ఆమె భర్త అంబల్ల శ్రీరాములునాయుడు కూడా రైల్వే సౌత్ సెంట్రల్ బోర్డు సభ్యత్వ పదవి రాజీనామాకు సిద్ధపడుతున్నారనే చర్చ నడుస్తోంది. ఇటీవల జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో మండలంలో కొన్ని అభివృద్ధి పనులకు ఎంపిపి ప్రతిపాదన పెట్టగా, కొందరు సభ్యులు వ్యతిరేకించారు. ఎమ్మెల్యే ప్రోద్భలంతోనే వ్యతిరేకించారని ఎంపిపి, ఆమె అనుయాయులు మనస్తాపానికి గురయ్యారని, అందువల్లే రాజనామాకు సిద్ధపడ్డారని ప్రచారం నడుస్తోంది. అస్సైన్ భూముల వ్యవహారంలో కూడా ఎంపిపి భర్త శ్రీరాములు నాయుడు, ఎమ్మెల్యే మధ్య అంతర్గత పోరు నడుస్తోందని కూడా అక్కడక్కడ చర్చ సాగుతోంది. కారణాలు ఏవైనా ఏకంగా ఎంపిపి పదవికి రాజీనామా చేయ డం, ఆమె వైపు చాలా ఎక్కువ మంది నాయకులు నిలవడం ఎమ్మెల్యేకు తలనొప్పిగా మారినట్లేనని పలువురు చెప్పున్నారు.

సాలూరు నియోజకవర్గంలోని పాచిపెంటలో వైసిపి నాయకుల మధ్య నెలకొన్న విబేధాల చిలికి చిలికి గాలివానగా మారి గడపగడపకు వైసిపి ప్రభుత్వం కార్యక్రమాన్ని బహిష్కరించే వరకు వెళ్లింది. మండలంలో వైసిపి కీలక నాయకులుగా ఉన్న డోల బాబ్జీ, తటికాయల గౌరీశ్వరరావు వేర్వేరు గ్రూపులకు నాయకత్వం వహిస్తున్నారు. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో రాజకీయంగా ఒకరినొకరు ఓడించుకునే వరకూ వచ్చిందని ఆ మండలంలో బాహాటంగానే చర్చ నడుస్తోంది. బాబ్జీకి డిప్యూటీ సిఎం ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారన్న భావనతో గౌరీశ్వరరావుతో పాటు, పార్టీ మండల అధ్యక్షులు గొట్టాపు ముత్యాల నాయుడు, ఎంపిపి బద్దిన ప్రమీల, పాచిపెంట వీరం నాయుడు (చినబాబు), చాలా మంది ఎంపిటిసి, సర్పంచులు ఉన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ఇటీవల బాబ్జి, గౌరీశ్వరరావు కలిసి పనిచేయడం ఎంపిపి, పార్టీ మండల అధ్యక్షుని గ్రూపునకు మింగుడు పడడం లేదు. ఈ నేపథ్యంలో పాచిపెంటలో డిప్యూటీ సిఎం, జిల్లా పరిషత్తు చైర్మన్ చేపట్టిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొనేందుకు నిరాకరించారు. ఎంపిపి, పార్టీ అధ్యక్షులు, వారి అనుయాయులు నేతలిద్దరికీ స్వాగతం పలికి, అక్కడి నుంచి వెనుదిరిగారు. నేతలకే ఇలాంటి అనుభవం ఎదురవడంతో వివాదం తారా స్థాయికి చేరినట్లేనని పలువురు విశ్లేషిస్తున్నారు.

శృంగవరపుకోటలో చాలా కాలంగా ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా గ్రూపు రాజకీయాలు నడుస్తున్నాయి. మరోవైపు ఎమ్మెల్సీ రఘురాజుకు వ్యతిరేకంగానూ శిబిరాలు నడుస్తున్నాయి. ఇటీవల జామి మండల పరిషత్తు సమావేశంలో ఎమ్మెల్సీ, జెడ్పిటిసి మధ్య వివాదం చోటుచేసుకుంది. కొద్దిరోజుల క్రితం ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా కొంతమంది సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు సమావేశం ఏర్పాటు చేశారు. ఆ సమావేశానికి ఎమ్మెల్సీ వెళ్లినప్పటికీ మంత్రి బొత్స హెచ్చరికతో వెంటనే వెనుదిరిగారని ప్రచారం నడుస్తోంది. విజయనగరం నియోజకవర్గంలో ఇంకా బహిర్గతం కాకపోయినప్పటికీ కొంతమంది కార్పొరేటర్లు స్థానిక ఎమ్మెల్యే తీరుపై గుర్రుగా ఉన్నారన్న చర్చనడుస్తోంది. ఈనేపథ్యంలో వైసిపిలో అంతర్గత పోరు తారా స్థాయికి చేరుతోందనే వాదన గట్టిగానే వినిపిస్తోంది.



కలెక్టరేట్ ముట్టడిని ఉద్దేశించి మాట్లాడుతున్న యూనియన్ నాయకులు ఎన్వై నాయుడు; నాయకులను ఈడ్చుకెళ్తున్న పోలీసులు

కనీస వేతనం ఇవ్వాలని

కలెక్టరేట్ ముట్టడి

పలువురు కార్మికులు, సిఐటియు నాయకుల అరెస్టు

ప్రజాశక్తి - కలెక్టరేట్

మున్సిపల్ కార్మికులందర్నీ పర్మినెంట్, సమాన పనికి సమాన వేతనం, రిటైర్మెంట్ బెనిఫిట్స్, సిపిఎస్ రద్దు, ఇంజనీరింగ్ కార్మికులకు టెక్నికల్ వేతనాలు, రిస్క్ అలవెన్సులు చెల్లిస్తామని ముఖ్యమంత్రి జగన్మోహన్రెడ్డి ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో పాలకొండ, పార్వతీపురం, సాలూరు పట్టణాలకు చెందిన మున్సిపల్ కార్మికులు జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. అధికారులు బయటకు రావాలని, తమ సమస్యలపై వినతులు స్వీకరించాలని కోరారు. అయినా ఏ అధికారి కార్మికుల సమస్యలను వినేందుకు రాలేదు. దీంతో కార్మికులంతా కలెక్టరేట్ను ముట్టడించారు. వెంటనే పోలీసులు కార్మికులను అదుపు చేసి, 53 మందిని తమ వాహనాల్లో టౌన్ పోలీస్ స్టేషన్కు తీసుకెళ్లారు. అనంతరం పూచికత్తుపై అందర్నీ విడుదల చేశారు. అనంతరం స్పందన కార్యక్రమం వద్దకు పాకల సన్యాసిరావు, బీపురపల్లి సింహాచలం, నాగవంశం మల్లేషు ఎస్. జాయింట్ కలెక్టర్ వినతిపత్రం అందజేశారు. తొలుత మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎన్.శంకరరావు, ఎన్వైనాయుడు ఆధ్వర్యంలో మున్సిపల్ ఆప్కాస్ విభాగ కార్మికుల, ఇంజనీరింగ్ వర్కర్స్ క్లాప్ ఆటో డ్రైవర్లు సమస్యలు పరిష్కరించాలని బెలగాంలోని సుందరయ్య భవనం నుంచి ఆర్టిసి కాంప్లెక్స్ వరకు ప్రధాన రహదారి మీదుగా నినాదాలు చేస్తూ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం కలెక్టరు కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ కార్మికులందర్నీ రెగ్యులర్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, సిపిఎస్ రద్దుచేసి ఓపిఎస్ అమలు చేయాలని, క్లాప్ ఆటో డ్రైవర్లకు రూ.18,500 వేతనం ఇవ్వాలని, బకాయి జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇంజనీరింగ్ కాంట్రాక్ట్ కార్మికులందరికీ హెల్త్ రిస్కు అలవెన్స్ ఇవ్వాలని, ఆప్కాస్ వల్ల 60ఏళ్ల వయసు నిండినవాళ్లు, అనారోగ్యంతో మృతి చెందిన కాంట్రాక్ట్ కార్మికుల కుటుంబాలకు వెంటనే నియామకాలు చేపట్టాలని కోరారు. పార్వతీపురం పారిశుధ్య విభాగంలో పనిచేస్తున్న పదిమంది కార్మికులకు రూ.18వేలు పూర్తిస్థాయి జీతాలు ఇవ్వాలని, పిఎఫ్, ఇఎస్ఐ అమలు చేసి ఆప్కాస్లో చేర్చాలని హెల్త్ అలవెన్స్ ఇవ్వాలని, పట్టణాల్లో పెరుగుతున్న జనాభాకు తగినంత మంది కార్మికుల సంఖ్యను పెంచి ఉన్న కార్మికులపై పని ఒత్తిడిని తగ్గించాలని, మూడేళ్లుగా కార్మికులకు ఇవ్వాల్సిన సబ్బులు, నూనెలు, చెప్పులు, ఇతర పనిముట్లు విడుదల చేయాలని, పార్వతీపురంలో బకాయి ఉన్న రెండు నెలల హెల్త్ అలవెన్స్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్వతీపురం, సాలూరు, పాలకొండ మున్సిపల్ వర్కర్స్ మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ నాయకులు మల్లేషు, సింహాచలం, టి.రాముడు, టి.శంకర్రావు, పి.భాస్కరరావు, సంజీవి, సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దావాల రమణారావు, యమ్మల మన్మధరావు, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ వి.ఇందిరా, సిఐటియు పట్టణ నాయకులు బంకురు సూరిబాబు, పట్టణ పౌర సంక్షేమ సంఘం అధ్యక్ష కార్యదర్శులు పాకల సన్యాసిరావు, సంచాన ఉమామహేశ్వరరావు పెద్దసంఖ్యలో పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

'జగనన్నకు చెబుదాం'కు పోటెత్తిన వినతులు

ప్రజాశక్తి - పార్వతీపురం

స్థానిక కలెక్టరేట్లో నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి సోమవారం ఫిర్యాదుదారులు పోటెత్తారు. పలు సామాజిక, వ్యక్తిగత సమస్యలపై 105 అర్జీలు వచ్చాయి. ఫిర్యాదుదారుల నుంచి కలెక్టర్ జిల్లా కలెక్టరు నిశాంత్ కుమార్ జాయింటు కలెక్టరు ఆర్.గోవిందరావు, ఐటిడిఎ పిఒ సి.విష్ణుచరణ్, డిఆర్ఒ జె.వెంకటరావు వినతులను స్వీకరించారు. అనంతరం ప్రజాసమస్యలపై జిల్లా అదికారులు, మండల అధికారులతో నేరుగా మాట్లాడి సమస్యల పరిష్కారానికి ఆదేశాలు జారీచేశారు. ఈ కార్యక్రమంలో అన్నిశాఖల జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఎస్పి స్పందనకు 14 దరఖాస్తులు

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక "స్పందన" కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, దిశా డిఎస్పీ ఎస్ఆర్సి హర్షిత జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను స్వీకరించారు. అర్జీదారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకొని, సంబంధిత పోలీసు అధికారులతో మాట్లాడి సత్వర న్యాయం అందించేలా కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఎస్బి సిఐ సిహెచ్.లక్ష్మణరావు, డిసిఆర్బి సిఐ ఎన్వి ప్రభాకరరావు, ఎస్ఐ పాపారావు, దిశా ఎస్ఐ లావణ్య పాల్గొన్నారు.



దీక్షలనుద్దేశించి మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మన్మధరావు

సమస్యల పరిష్కారం కోసం

విఆర్ఎల నిరసన దీక్షలు

ప్రజాశక్తి - కలెక్టరేట్

సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ గ్రామ రెవెన్యూ సహాయకులు 36 గంటలు నిరసన దీక్షలు స్థానిక కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం ప్రారంభమయ్యాయి. విఆర్ఎల సంఘం జిల్లా అధ్యక్షులు గరుగుబిల్లి ఈశ్వరరావు అధ్యక్షతన ప్రారంభమైన ఈ నిరసన దీక్షలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మధరావు, విఆర్ఎ సంఘం కార్యదర్శి జి.కృష్ణారావు మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి రాగానే విఆర్ఎల సమస్యలు పరిష్కారిస్తామని చెప్పారు. కానీ నేటికీ సమస్యలు పరిష్కారం కాలేదని, కనీస వేతనం రూ.26,000, అర్హులైన వారికి వాచ్మెన్, కంప్యూటర్ ఆపరేటర్గా పదోన్నతులు కల్పించాలని, రికవరీ చేసిన డిఎని తిరిగి చెల్లించాలని, నామినీలుగా పనిచేస్తున్న వారిని విఆర్ఎలుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. గత కొన్నాళ్లుగా ప్రభుత్వానికి విన్నవిస్తున్నా కనీసం స్పందించడం లేదన్నారు. తప్పని పరిస్థితుల్లో 36 గంటలు దీక్షలకు దిగామని, ఇప్పటికైనా జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఆలోచించి తమ సమస్యలు పరిష్కరించాలని, లేని పక్షంలో చలో విజయవాడ కార్యక్రమాన్ని చేపడతామని అన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు రెడ్డి వేణు, శ్రామిక మహిళ నాయకులు ఇందిరా, సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు, పట్టణ నాయకులు బి.సూరిబాబు, డి.శ్రీను, సుదర్శన్, మిన్నారావు, రామయ్యాయ, బాబురావు, పలు మండలాల విఆర్ఎ పాల్గొన్నారు.

ఆర్టిసిలో త్వరలో ఉద్యోగోన్నతులు

ప్రజాశక్తి- సాలూరు

ఆర్టిసి ఉద్యోగులకు త్వరలో పదోన్నతులు రానున్నాయని ఎపి పిటిడి ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పి.దామోదరరావు చెప్పారు. సోమవారం స్థానిక సెంటెనరీ కమ్యూనిటీ హాలులో నిర్వహించిన యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్టిసి రిక్రూట్మెంట్ సర్వీస్ రూల్స్ ద్వారా ఉద్యోగాల్లో చేరినందున ప్రభుత్వ సర్వీసు రూల్స్తో కొన్ని ఇబ్బందులు వున్నాయని సంస్థ ఎండి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దృష్టికి తీసుకెళ్ళినట్లు చెప్పారు. పాత సర్వీస్ రూల్స్ అమలు చేయాలని కోరగా అందుకు ఉన్నతాధికారులు అంగీకరించారని, త్వరలో 3,500 మందికి పదోన్నతులు రానున్నాయని తెలిపారు. ఎంప్లాయిస్ యూనియన్ కృషి వల్లనే పాత సర్వీస్ రూల్స్ అమలు లోకి రానున్నాయని చెప్పారు. ఆర్టిసి విలీనం తర్వాత జీతం ఆధారంగా చెల్లించే ఒటి అలవెన్సు, నైట్ హాల్ట్ అలవెన్సు, మహిళా ఉద్యోగులకు ఇచ్చే మెడికల్ అలవెన్సులను జీతంతో పాటు చెల్లించాలని కోరినట్లు చెప్పారు. డ్రైవర్, కండక్టర్లకు, గ్యారేజ్ సిబ్బందికి పాత పద్ధతిలోనే ఇన్సెంటివ్ చెల్లించాలని కోరినట్లు తెలిపారు. రిఫరల్ ఆసుపత్రుల్లో మెరుగైన కార్పొరేట్ వైద్యం అందేలా చూడాలని కోరామని తెలిపారు. రిటైర్డ్ ఉద్యోగులకు మెడికల్ స్కీం కింద వైద్యం అందేలా చూడాలని కోరామన్నారు. ప్రధాన కార్యదర్శి జీవి నర్సయ్య మాట్లాడుతూ ఉద్యోగులకు పెండింగ్లో ఉన్న లీవ్ ఎన్ క్యాష్ మెంట్ సెప్టెంబర్లోగా చెల్లింపునకు అంగీకారం తెలిపినట్లు చెప్పారు. ఆర్టిసి విలీనం తర్వాత కేడర్ స్ట్రెంగ్త్ ద్వారా ఉత్పన్నమైన సమస్యలను పరిష్కరించాలని కోరినట్లు తెలిపారు. దీనికి ఎమ్డి అంగీకరించారని తెలిపారు. తొలుత కార్మికులు డిపో నుంచి ప్రధాన రహదారి మీదుగా ర్యాలీ నిర్వహించారు. ఈ సమావేశంలో డిప్యూటీ జనరల్ సెక్రటరీ పి.భానుమూర్తి, రాష్ట్ర కమిటీ సభ్యులు పి.సత్యనారాయణ, ఎపి జెఎసి అమరావతి జిల్లా కార్యదర్శి డిజి ప్రసాద్ మాట్లాడారు. ఎంప్లాయీస్ యూనియన్ మన్యం జిల్లా కార్యదర్శి పి.సుందరరావు, విజయనగరం జిల్లా కార్యదర్శి జి.రవికాంత్, డిపో కార్యదర్శి ఎంఎస్ నారాయణ పాల్గొన్నారు.

11న ఆహార కమిషన్ సభ్యులు రాక

ప్రజాశక్తి - పార్వతీపురం

రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు ఈనెల 11న జిల్లాలో పర్యటిస్తారని జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆహార కమిషన్ సభ్యులు ఇ.లక్ష్మీ రెడ్డి, జి.దేవి జిల్లాలో పర్యటించనున్నట్టు ఆయన చెప్పారు. ఉదయం 10.30 గంటలకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత జిల్లా అధికారులతో సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అధికారులు సమగ్ర సమాచారంతో సమీక్షా సమావేశానికి హాజరు కావాలని ఆయన ఆదేశించారు. సమావేశం అనంతరం కమిషన్ సభ్యులు క్షేత్ర స్థాయిలో పర్యటిస్తారని ఆ ప్రకటనలో వివరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్కుమార్

గృహ ప్రవేశాలకు సిద్ధం చేయండి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని పేదలకు నిర్మిస్తున్న ఇళ్లను లక్ష్యం మేరకు పూర్తి చేసి గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి మండల స్థాయి అధికారులతో అభివృద్ధి పనుల పురోగతిపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఈనెల 21 తర్వాత 5 లక్షలకు గృహ ప్రవేశాలు చేపట్టనున్నారన్నారు. అందులో భాగంగా జిల్లాలోని మక్కువ గహ నిర్మాణ కాలనీలో జిల్లా స్థాయి గృహ ప్రవేశాలు నిర్వహించనున్నందున పనులను త్వరితగతిన పూర్తి చేసి సిద్ధం చేయాలన్నారు. కాలనీలో మంచినీటి వసతి, విద్యుత్ , అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు. కాలనీలో సకల వసతులతో సుందరంగా తీర్చిదిద్దాలని అన్నారు. అర్బన్, గ్రామీణ ప్రాంతాల్లో పైకప్పు స్థాయిలో ఉన్న ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసి లక్ష్యాలను సాధించాలన్నారు. ఈనెల 20లోగా లక్ష్యం ఏర్పాటు చేసుకొని ఇళ్లు పూర్తి చేయాలన్నారు. అవసరమైన వసతుల కల్పనకు తన దృష్టికి తీసుకువస్తే అనుమతులు మంజూరు చేస్తామని స్పష్టం చేశారు. జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు, హౌసింగ్ పీడీ తమ్మినేని రమేష్, జిల్లా విద్యా శాఖ ఎడి ఈ.ఎమ్.రామ జ్యోతి, డ్వామా, డిఆర్డిఎ పీడీలు కె.రామ చంద్ర రావు, పి.కిరణ్ కుమార్, జిల్లా పంచాయితీ రాజ్ ఇంజనీరింగ్ అధికారి డా,ఎంవిజి కృష్ణాజీ, ఆర్డబ్ల్యుఎస్ ఇంజినీరింగ్ అధికారి ఓ. ప్రభాకర రావు, డిఎంహెచ్ఒ బి.జగన్నాథ రావు, డిపిఒ బి.సత్యనారాయణ, జిల్లా సర్వే, సెటిల్ మెంట్ అధికారి కె.రాజ్కుమార్,ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు

చంద్రబాబు పర్యటనను విజయవంతం చేయండి

ప్రజాశక్తి - కురుపాం

టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు పర్యటన విజయవంతం చేయాలని కేంద్ర మాజీ మంత్రి వైరిచర్ల కిషోర్ చంద్ర సూర్యనారాయణదేవ్ టిడిపి శ్రేణులకు పిలుపునిచ్చారు. సోమవారం జియ్యమ్మవలస మండలం చినమేరంగిలో శత్రుచర్ల కోటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ఈనెల 9న తోటపల్లి ప్రాజెక్టు పరిశీలనకు వస్తున్నారని, రైతులతో ప్రత్యేక సమావేశం ఉంటుందని తెలిపారు. కావున టిడిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, రైతులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. విలేకరుల సమావేశంలో రాష్ట్ర మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజు, సాలూరు, కురుపాం నియోజకవర్గాల టిడిపి ఇన్ఛార్జులు గుమ్మడి సంధ్యారాణి, టి.జగదీశ్వరి, నియోజకవర్గం పరిశీలకులు ఆరేటి మహేష్, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సీతానగరం : మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన విజయవంతం చేయాలని పార్వతీపురం నియోజకవర్గ టిడిపి ఇన్ఛార్జి ఇన్ఛార్జి బోనెల విజయ్చంద్ర పిలుపునిచ్చారు. సోమవారం కె.కిషోర్ ఇంటి వద్ద టిడిపి మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు పర్యటనలో కార్యకర్తలు అన్ని గ్రామాల నుంచి కదిలించేలా ప్రయత్నం చేయాలన్నారు. వైపిసి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను ఎండగట్టేందుకు ఈ బహిరంగ సభ ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు గొట్టాపు వెంకటనాయుడు, మండల పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు కొల్లి తిరుపతిరావు, రైతు వేణుగోపాల్ నాయుడు, మండల కమిటీ నాయకులు సాల హరిగోపాలరావు, దామినేని భానుప్రసాద్, ఎస్.శ్రీనివాసరావు, పెదబాబు, సర్పంచి జొన్నాడ తెరేజమ్మతో పాటు వివిధ గ్రామాలకు చెందిన కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మాజీ మంత్రి కిశోర్చంద్రదేవ్, పక్కన శత్రుచర్ల, టిడిపి నాయకులు

పార్వతీపురం టౌన్ : టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 9న పార్వతీపురంలో పర్యటిస్తున్నారని, ఈ పర్యటనను విజయవంతం చేయాలని మున్సిపల్ మాజీ చైర్పర్సన్ ద్వారపురెడ్డి శ్రీదేవి అన్నారు. పట్టణంలోని కొత్తవలసలో గల టిడిపి నాయకులతో కలిసి చంద్రబాబు పర్యటనను విజయవంతం చేయాలని సోమవారం ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు గుంట్రెడ్డి రవికుమార్, నాయకులు కోలా మధు, సిరిపురపు భాస్కరరావు, సందక దేశాలు, మీసాల రమణ, సారికిగణేష్, సుంకరి రమణ, తదితరులు పాల్గొన్నారు.

డీ వార్మింగ్ డే వాల్పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - పార్వతీపురం

1-19 ఏళ్ల వయస్సు వారందరికీ నులిపురుగుల నివారణ మందు అందించాలని కలెక్టరు నిశాంత్ కుమార్ తెలిపారు. సోమవారం కలెక్టరు కార్యాలయంలో ఈనెల 10న జరగబోయే డీ వార్మింగ్ డే (నులి పురుగులు నివారణ కార్యక్రమం) రెండో విడతకు సంబంధించిన గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు మాట్లాడుతూ జిల్లాలో 1-2ఏళ్ల గల 19,106 మందికి సగం మాత్ర, 2-19 ఏళ్ల గల 1,71,332 మందికి ఒకమాత్ర చొప్పున పాఠశాలలు, అంగన్వాడీ సెంటర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా పంపిణీ చేసేందుకు ముందస్తు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. నులి పురుగుల నివారణకు మాత్రలు పంపిణీతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పట్ల ప్రజల్లో అవగాహన కల్పించాలని తెలిపారు. చేతులు కడుగుకొనే విధానాన్ని ప్రచారం చేయాలని వైద్యశాఖాధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జెసి ఆర్.గోవిందరావు, ఐటిడిఎ పిఒ సి.విష్ణుచరణ్, డిఆర్ఒ జె.వెంకటరావు, డిఎంహెచ్ఒ బి.జగన్నాధరావు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యమిత్రకు పురస్కారం

ప్రజాశక్తి - బెలగాం

జిల్లాలో వైఎస్ఆర్. ఆరోగ్యశ్రీ, ఆరోగ్య ఆసరా పథకాల్లో జూన్ 2023 లబ్ధిదారులకు ఉత్తమ సేవలందించేందుకు గాను సీతంపేట ఏరియా ఆసుపత్రి ఆరోగ్యమిత్రగా పనిచేస్తున్న కుండంగి రాజశేఖర్కు రాష్ట్ర ప్రభుత్వం తరపున కలెక్టరు నిశాంత్ కుమార్ ఆరోగ్య మిత్ర పురస్కారం అందజేశారు. జిల్లా కలెక్టరు కార్యాలయంలో కుండంగి రాజశేఖర్కు ఆరోగ్య మిత్ర పురస్కారం, ప్రశంసాపత్రంతో పాటు, రూ.5వేలు నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో జెసి ఆర్.గోవిందరావు, ఐటిడిఎ పిఒ సి.విష్ణుచరణ్, డిఆర్ఒ జె.వెంకటరావు, డిఎంహెచ్ఒ బి.జగన్నాధరావు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



ఉత్సవ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఐటిడిఎ పిఒ విష్ణుచరణ్

ఆదివాసీ ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు

అధికారులతో ఐటిడిఎ పిఒ సమీక్ష

ప్రజాశక్తి - సాలూరు

ఈనెల 9న నిర్వహించనున్న ప్రపంచ ఆదివాసీ ఉత్సవాలు విజయవంతం చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఆదివాసీ ఉత్సవాలకు పగడ్బందీ ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ మేరకు ఐటిడిఎ పిఒ విష్ణు చరణ్ వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో సోమవారం సమీక్ష నిర్వహించారు. రాష్ట్రం నలుమూలల నుంచి గిరిజన సంఘాల నాయకులు, అధికారులు హాజరు కానున్న నేపథ్యంలో ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని పిఒ కోరారు. ఉత్సవాల నిర్వహణలో భాగంగా గిరిజన సంస్కతి సంప్రదాయాలు ఉట్టిపడేలా కళా ప్రదర్శనలు, స్టాల్స్ ఏర్పాటు పై ఆయన అధికారులకు సూచించారు. డిప్యూటీ సిఎం రాజన్నదొర ఉత్సవాల నిర్వహణపై ఆదివారం స్థానిక అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్ష లో గిరిజన సంక్షేమ డిడి కె.శ్రీనివాసరావు, జిసిసి డిఎం మహేంద్ర కుమార్, డిఇఒ నిమ్మక ప్రేమ్కుమార్, వెలుగు అధికారులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేస్తాం : టిడిపి

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

నియోజకవర్గంలో టిడిపి గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు, నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి బోనెల విజయచంద్ర సంయుక్తంగా ప్రకటించారు. సోమవారం కృష్ణపల్లిలో గల మాజీ ఎమ్మెల్యేలు యర్రా కృష్ణమూర్తి, అన్నపూర్ణమ్మ కుటుంబాలతో పాటు, మాజీఎమ్మెల్యే చిరంజీవులు ఇంటికి వెళ్లి ఆశీర్వాదాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా విజయచంద్ర మాట్లాడుతూ నియోజకవర్గ రాజకీయ పరిస్థితులను అధ్యయనం చేసిన పార్టీ అధినేత ఆదేశాల మేరకు తాను ఈ బాధ్యతలు చేపట్టినప్పటికీ, ఇంత వరకూ పార్టీ కోసం కృషి చేసిన నాయకుల సహాయ, సలహాల మేరకు, వారిని కలుపుకుని, తగిన ప్రాధాన్యతనిస్తూ నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. ఆక్రమంలోనే నాయకులను, సీనియర్ కార్యకర్తలను వ్యక్తిగతంగా కలిసి భవిష్యత్తు కార్యక్రమాల నిర్వహణకు కలిసికట్టుగా కదలిరావాలని కోరారు. కార్యక్రమంలో ఎర్రా కుటుంబానికి చెందిన ఎఎంసి మాజీ చైర్మన్ రెడ్డి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులును కలసినట్లు తెలిపారు. అనంతరం చిరంజీవులు కార్యాలయంలో వారిద్దరూ వ్యక్తిగత సమావేశం ఆనంతరం ఇకపై పార్టీ విజయమే లక్ష్యంగా పనిచేసి, పార్వతీపురంలో తెలుగుదేశం జెండా రెపరెపలాడించి వచ్చే ఎన్నికలలో విజయ సాధిస్తామని, చంద్రబాబును ముఖ్యమంత్రని చేస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు జి.వెంకటనాయుడు, బార్నాల సీతారాం, ఎఎంసి మాజీ చైర్మన్ రెడ్డి


కలిసి కట్టుగా పనిచేస్తామని అభివాదం చేస్తున్న నాయకులు

శ్రీనివాసరావు, డాక్టర్ గరిమెళ్ల భానుప్రసాద్, బలిజిపేట మండల పార్టీ అధ్యక్షులు పెంకి వేణుగోపాలనాయుడు, 7వవార్డు కౌన్సిలర్ కోరాడ నారాయణరావు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

ప్రస్తుత ఎమ్మెల్యేకు రిటన్ గిఫ్ట్ ఇద్దాం

బలిజిపేట: ప్రస్తుత ఎమ్మెల్యే జోగారావుకు రిటన్ గిఫ్ట్ ఇద్దామని పార్వతీపురం టిడిపి నియోజకవర్గ ఇంఛార్జి బోనెల విజయ చంద్ర అన్నారు. మండల టిడిపి కార్యాలయంలో మండల అధ్యక్షులు పెంకి వేణు గోపాల్ నాయుడు ఆధ్వర్యంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. చంద్రబాబు నాయుడు చేపట్టిన సాగునీటి ప్రాజెక్టుల విధ్వంసంపై యుద్ధభేరి కార్యక్రమంలో భాగంగా కురుపాం నియోజకవర్గంలోని సర్దార్ గౌతు లచ్చన్న తోటపల్లి ప్రాజెక్టును పరిశీలించడానికి ఈనెల 9 న రానున్నారన్నారు. మండలం నుంచి అధిక సంఖ్యలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్ని చంద్రబాబుకు ఘన స్వాగతం పలుకుదామని పిలుపునిచ్చారు. అనంతరం కార్యాలయం నుండి ర్యాలీగా నినాదాలు చేస్తూ స్థానిక హైస్కూల్ వద్ద ఉన్న ఎన్‌టిఆర్ విగ్రహం వద్దకు వెళ్లి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు, సీనియర్ నాయకులు గొట్టాపు వెంకట్ నాయుడు, సీనియర్ నాయకులు బర్నర్ సీతారాం, బాబ్జి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

నోంద్రకోనలో భవిష్యత్తుకు గ్యారెంటీ

గుమ్మలక్ష్మీపురం : మండలంలోని నోంద్రకోన గ్రామంలో టిడిపి ఆధ్వర్యంలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి సీనియర్ నాయకులు, ఎమ్మెల్యే టికెట్ ఆశావాహి బిడ్డిక పద్మావతి మాట్లాడుతూ వైసిపి నాలుగున్నరేళ్ల పాలనలో ఏజెన్సీలో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందన్నారు. టిడిపి అధికారంలోకి వస్తేనే గిరిజన కళ్ళల్లో కాంతులు కనిపిస్తాయని అన్నారు. ప్రజల భవిష్యత్ బాగుండాలంటే 2024 ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కొండలరావు, నాగేశ్వరరావు గ్రామస్తులు పాల్గొన్నారు.

ముమ్మరంగా స్టోన్ ప్లాంటేషన్

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని చిదిమి, సిఎస్ ఆర్‌పేట తదితర గ్రామాల్లో స్టోన్ ప్లాంటేషన్ కార్యక్రమాన్ని ముమ్మరంగా నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ సిహెచ్ సత్యనారాయణ సోమవారం తెలిపారు. గ్రామాల్లో ఇటీవల జగనన్న భూ రీసర్వే కార్యక్రమంలో భాగంగా సర్వే పూర్తయిన గ్రామాల్లో స్టోన్ ప్లాంటేషన్ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు.

తెగుళ్ల పట్ల అప్రమత్తం

ప్రజాశక్తి - సీతానగరం

రైతులు మొక్కజొన్న పై వస్తున్న తెగుళ్ల పై అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయ శాఖ అధికారి ఎస్. అవినాష్ అన్నారు. మండలంలోని కొటసీతారాంపురంలో మొక్కజొన్న పంటను సోమవారం పరిశీలించారు. మొక్కజొన్న పంటపై కాండం తెగులును గుర్తించారు. దీని నివారణకు ఒక లీటర్ నీటిలో మూడు గ్రాముల కాపర్ ఆక్సిక్లోరైడ్ మొక్క చుట్టు గుంత తవ్వి దీనిని స్ప్రే చేస్తే తెగులు పోతుందన్నారు. మొక్కజొన్న పంట పై రైతులు అప్రమత్తంగా ఉండి తెగుళ్ళ గుర్తిస్తే దిగుబడులు బాగా వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆ గ్రామ వ్యవసాయ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

పనులు పూర్తి చేయాలి

ప్రజాశక్తి - సీతానగరం

పాఠశాలలకు నా దేశం నా భూమి కింద మంజూరైన పనులు పూర్తి చేయాలని ఎంపిడిఒ ఎంఎస్ఎల్ఎన్ ప్రసాద్ అన్నారు. మండలంలోని చిన్న రాయుడు పేట ప్రాథమిక పాఠశాలను సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన నా భూమి నా దేశం పథకం కింద పనులను పూర్తి చేయాలన్నారు. ముందుగా పాఠశాల వద్ద బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి కేకే వర్మ పాల్గొన్నారు.

శ్మశాన వాటికకు మరమ్మతులు

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని అప్పయ్యపేట మైనార్టీలకు కేటాయించిన శ్మశాన వాటిక వద్ద ఉన్న తుప్పలు, డొంకలు పొక్లెయిన్ జెసిబితో తొలగించి మరమ్మతు పనులు చేపట్టారు. ఎంపిటిసి బురిడి కుసుమ సూర్యనారాయణ ఆధ్వర్యంలో జెసిబితో శుభ్రం చేయించారు. ఈ మరమ్మతు పనులకు ఎమ్మెల్యే జోగారావు నిధులు కేటాయించినట్లు ఆయన వెల్లడించారు.

రైతు సంఘం నాయకుల గృహనిర్బంధం

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బంటు దాసుని ఆయన ఇంటి వద్దనే పోలీసులు గృహనిర్బంధం చేశారు. విజయవాడలో జరుగుతున్న ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మహాధర్నాకు హాజరుకానీయకుండా ఉంచేందుకు పోలీసులు గృహ నిర్బంధం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతులను, రైతు సంఘాల పోరాటాలను అణచివేసే దారిలో రాష్ట్రంలో కూడా వైసిపి ప్రభుత్వం పాటిస్తున్నది, ఇది దుర్మార్గమైన చర్య అని విమర్శించారు. ఇటువంటి నిర్బంధాల వల్ల రైతు సంఘాల నాయకులను ఆపగలరేమోగాని రైతుల పోరాటాలను ఉద్యమాలను అణచివేయడం అసాధ్యమని హెచ్చరించారు.

కంబరలో ఫ్యామిలీ డాక్టర్

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని కంబరలో సోమవారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి పి.ఉమామహేశ్వర వివిధ రకాలైన రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ నయామి, ఎం ఎల్ హెచ్ పి రమకృష్ణ, ఎఎన్ఎం హేమలత, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

పార్వతీపురం ఎంపిడిఒగా రమణ

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

స్థానిక మండల పరిషత్ అధికారిగా ఇదే కార్యాలయంలో పరిపాలన అధికారిగా పనిచేస్తున్న జివి రమణ అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఎఫ్ఎసి ఎంపిడిఒగా ఇంతవరకు పనిచేసిన శంబంగి రమేష్ తన మాతృ స్థానం కొమరాడకు బదిలీపై వెళ్లారు. ఎఫ్ఎసిగా బాధ్యతలు స్వీకరించిన రమణకు సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

ఖాళీ స్థానాల ఎన్నికకు నోటిఫికేషన్

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని గుమ్మ సర్పంచ్, బియ్యాల వలస ఉపసర్పంచ్ ఎన్నికకు ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ జారీ చేసినట్లు ఎంపిడిఒ వివి శివరామప్ప తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందిన సర్పంచ్, ఉప సర్పంచ్ స్థానాలు ఖాళీ అవ్వడంతో ఎన్నికల కమిషన్ ఆదేశాలు మేరకు ఆ స్థానాలకు ఆగస్టు 8నుంచి 10 వరకు నామినేషన్ల స్వీకరణ, 11న స్క్రూట్నీ జరుగుతుందని, 12న అభ్యంతరాలుంటే ఐదు గంటల్లో సమర్పించాలని, 13న అభ్యర్థుల పేర్లను ప్రకటిస్తామని తెలిపారు. పోటీ నుంచి ఉపసంహరణ అవ్వాలనుకున్న వారు ఈనెల14న 3 గంటల్లోపు అవ్వాలని, 19న ఉదయం 7 గంటల నుంచి 1 గంట వరకు పోలింగ్ ఉంటుందని, 2గంటల నుంచి ఓట్లు లెక్కించి తర్వాత ఫలితాలు ప్రకటిస్తామన్నారు.

సార్వత్రిక విద్యా విధానం సద్వినియోగం

ప్రజాశక్తి- బలిజిపేట

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సార్వత్రిక విద్యా విధానం ద్వారా విద్యను నేర్చుకోవడం ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని బలిజిపేట జెడ్‌పిటిసి అలజంగి రవికుమార్ అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం పోస్టర్స్‌ను ఆయన ఎంపిడిఒ విజయలక్ష్మి, ఎఒ భానుమూర్తి, ఎంఇఒ సింహాచలంతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సార్వత్రిక విద్య విధానం ద్వారా చదువుకు దూరమైన వారికి, బడి మధ్యలో మానేసిన వారికి, ఎస్ఎస్‌సిలో ఫెయిల్ అయిన వారికి, 10వ తరగతి చదవగల సామర్థ్యం కలిగి ఎటువంటి విద్యార్హతలు లేకపోయినప్పటికీ 14 సంవత్సరాలు పూర్తయిన వారు అర్హులన్నారు. గరిష్ట వయోపరిమితి లేదన్నారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ తరగతులను అభ్యసించవచ్చుని, ఉద్యోగులు సెలవు దినాల్లో తరగతులకు హాజరు కావచ్చుని, ఇందులో వృత్తి విద్యా సబ్జెక్టులకు కూడా అవకాశం కల్పించారని అన్నారు. కార్యక్రమంలో నూకలవాడ సర్పంచ్ వెంకటరమణ, ఎమ్మార్సీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వాలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - కొమరాడ

మండలంలో వివిధ గ్రామాల్లో ఖాళీగా ఉన్న వాలంటీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపిడిఒ మల్లికార్జునరావు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలోని చోళపదం, పెద్ద శాఖ, కొమరాడ, మాదలింగి, కెమిసేల, దుగ్గి గ్రామ పంచాయతీలో ఒక వాలంటీర్ పోస్ట్ చొప్పున, గంగిరేగువలస పంచాయతీలో 2 ఖాళీలు ఉన్నాయని అన్నారు. ఈ నెల 7 నుండి 11 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. 12న దరఖాస్తుల పరిశీలన 13న ఎంపిక కమిటీ ద్వారా మౌఖిక పరీక్ష ఉంటుందన్నారు. 13న ఎంపిక కాబడిన వాలంటీర్లకు సమాచారం ఇచ్చి 14న వాలంటీర్ల నియామకం, 15 సిఎఫ్ఎంఎస్ ఐడిలు క్రియేట్ చేసి వాలంటీర్లు జాయిన్ చేసుకుంటామని చెప్పారు. అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

అంతర పంటలతో అధిక ఆదాయం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ప్రకృతి వ్యవసాయం చేయడం ద్వారా అంతర పంటలతో అధిక ఆదాయం పొందవచ్చని నాబార్డ్ డిడిఎం టి.నాగార్జున అన్నారు. జట్టు వ్యవస్థాపకులు డి.పారినాయుడు అధ్యక్షతన సోమవారం జీవ పైలెట్ ప్రాజెక్టు చెందిన 40మంది రైతులతో క్షేత్రాల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలోని 23 ప్రాంతాల్లో మా తోటలో జీవ పైలెట్ ప్రాజెక్టు ఎంపిక చేయడం జరిగిందని, అందులో జట్టు ట్రస్ట్ ఎంపికైనట్టు తెలిపారు. సోమవారం గొరడలోని మా తోట రైతు తాడంగి బంగారాజు వ్యవసాయ క్షేత్రంలో నవధాన్యాలు, వాటి ప్రగతిని, వేరుపొడవు, మొక్క పొడవు, శ్రీవరి, వరి నారుమడులను మొదలగు విషయాలు పరిశీలించారు. చేసిన పద్ధతులను అడిగి తెలుసుకున్నారు. రాయగడ జమ్మిలో పువ్వుల లక్ష్మి, పువ్వుల దొరమ్మ మా తోట క్షేత్రాలను పరిశీలించారు. పైలెట్ ప్రాజెక్టు కింద 40మంది రైతులు తమ మొత్తం విస్తీర్ణాల్లో ఏడాది పొడవునా పంటలు పండించుకోవాలని, అన్ని రకాల పోషకాలు కలిగిన పంటలను తమ క్షేత్రాల్లో పండించుకుని ఎల్లవేళలా అందుబాటులో ఉండేలా చేసుకోవాలని సూచించారు. రైతులు ఆర్థిక అభివృద్ధి సాధించడానికి నాబార్డు ఎల్లప్పుడూ తమ పూర్తిస్థాయి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. జట్టు సంస్థ పర్యవేక్షణలో మా తోట రైతులు ఏ విధమైన రసాయన ఎరువులు,


క్షేత్ర స్థాయిలో పరిశీలన చేస్తున్న నాబార్డు డిడిఎం నాగార్జున

పురుగు మందులు వాడకుండా ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటిస్తూ ఆర్థిక అభివృద్ధి సాధించడం అభినందించదగ్గ విషయమన్నారు. పండ్ల తోటల్లో అంతర పంటలుగా పసుపు, అల్లం, పైనాపిల్, సారికంద, కందులు, కొర్రలు, సామలు, ఆకుకూరలు, కాయగూరలు, తీగ జాతులు, శ్రీరాగి, గడ్డి పెంపకం మొదలగు పంటలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం రైతులకు భూసార పరీక్ష కార్డులను అందించారు. కార్యక్రమంలో మా తోట కమిటీ సభ్యులు ఎం.కమల కుమారి, కార్యదర్శి కె.చిరంజీవిలు, జట్టు ఎగ్జిక్యూటివ్ ట్రస్ట్ ఎస్.ప్రహరాజ్, జీవ కోఆర్డినేటర్ జి.ప్రబోధ్, జి.మురళీమోహన్, కార్యకర్తలు రైతులు పాల్గొన్నారు.

చేనేతకు చేయూత

ప్రజాశక్తి- పాలకొండ రూరల్

చేనేత వస్త్రాలకు చేయూతనిద్దామని వెంకంపేట ఎంపియుపి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.పరాంకుశంనాయుడు అన్నారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని పాఠశాలలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చేనేతలు, హస్తకళల గురించి విద్యార్థులకు వివరించారు. చేనేత ప్రాముఖ్యతపై విద్యార్థిని అనూష ప్రసంగించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ స్వాతంత్ర్య భారతదేశంలో వ్యవసాయం తర్వాత ప్రాధాన్యత గల రంగం చేనేత అని తెలిపారు. నేత వస్త్రాల వాడకం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. అనంతరం చేనేత వస్త్రాలు, హస్త కళా వస్తువులను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో సిఆర్‌పి లక్ష్మణ, ఉపాధ్యాయులు నాగమణి, గోపి, ఉదయ్, పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ జి. జనార్ధన్ నాయుడు ఆధ్వర్యంలో జాతీయ చేనేత వస్త్ర దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా పాలకొండ స్థానిక ఆప్కో చేనేత వస్త్రాలయ దుకాణదారులు కళాశాల నందు వస్త్ర


బలిజిపేట: మగ్గాన్ని పరిశీలిస్తున్న జమ్మాన ప్రసన్నకుమార్

ప్రదర్శన చేశారు. అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది వారికి నచ్చిన వస్త్రాలను కొనుగోలు చేశారు.

బలిజిపేట: ప్రభుత్వం చేనేత రంగం అభివృద్ధికి కృషి చేస్తుందని ఎపి టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని అరసాడలో జరిగిన జాతీయ చేనేత దినోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అరసాడలో అత్యధిక చేనేత వృత్తినే జీవనాధారంగా చేసుకుని పనిచేస్తున్నారన్నారు. అనంతరం ఉత్తమ చేనేత కార్మికుల సేవలను గుర్తించి వారిక సత్కరాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి గుల్ల ప్రభావతి, రాజు, సర్పంచ్ రామకృష్ణ, మాజీ ఎంపిటిసి పాపు నాయుడు, నాయకులు జగదీష్, అప్పలనాయుడు పాల్గొన్నారు.

పలుచని నాట్లు దిగుబడికి మెట్లు

ప్రజాశక్తి - పాచిపెంట

వరి నాట్లు పలుచగా వేసుకుని ఒకటే లేదా రెండు మొనలు మాత్రమే జానెడు దూరంలో నాటుకొని నాట్లు తేలికగా వేసుకుంటే దిగుబడి పెరుగుతుందని మండల వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు అన్నారు. మండలం లోని బొబ్బిలివలసకు చెందిన రైతు టి.వెంకట మృత్యుంజయరావు తన రెండున్నర ఎకరాల పొలంలో శాస్త్రీయ పద్ధతిలో వేసిన వరి నాట్లను పరిశీలిస్తూ పరినాట్లు బురద పదునులో మాత్రమే వేసుకోవాలని, పైపైన మాత్రమే నాటు కోవాలని సూచించారు. మొనలను భూమిలో లోపలకి గుచ్చినట్లయితే పిలకలు వచ్చే భాగం లోతుగా వెళ్లిపోవడం వల్ల పిలకలు ఆలస్యం అవ్వడమే కాకుండా పిలకల సంఖ్య తగ్గి తద్వారా కంకుల సంఖ్య తగ్గడం వల్ల దిగుబడి తగ్గిపోతుందని తెలిపారు. ముందుగా పొలంలో పచ్చిరొట్ట విత్తనాలు చల్లుకుని పూత దశలో కలియదున్ని దమ్ములో ఎకరాకు ఒక బస్తా డిఎపి, 25 కిలోల యూరియా, 17 కిలోల పోటాష్ వేసుకోవాలన్నారు.

హిజ్రాల రక్షణకు '1091'

కురుపాం: హిజ్రాల రక్షణ కోసం 1091 టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయడం మంచి పరిణామమని హెల్పింగ్ హ్యాండ్స్ హిజ్రా అసోసియేషన్ వ్యవస్థాపక గౌరవ అధ్యక్షులు దవడ కొండబాబు అన్నారు. సోమవారం మం డల కేంద్రంలోని ఐకెపి కార్యాలయంలో ఏర్పా టు చేసిన హిజ్రాల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ఎవరైనా సమాజంలో హిజ్రాలను హేళనకు గురి చేసినా, ఇబ్బందులు కలిగించిన 1091 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయాలన్నారు. అనంతరం ట్రాన్స్ జెండర్స్ ఆధ్వర్యంలో ప్రపంచ ఆదివాసి దినో త్సవం పండుగను జరుపుకున్నారు. హెల్పింగ్ హ్యాండ్స్ హిజ్రా అసోసి యేషన్ ఉపాధ్యక్షులు గీతారాణి, అసోసియేషన్ సభ్యులు నందిని, చిన్ని, శృతి, సిస్టర్ అమిత, వైడిఒ నెట్వర్క్ పిఎంఎల్ శ్రీకాంత్ బాబు, పాల్గొన్నారు.

సమగ్ర విచారణ జరిపించాలి

ప్రజాశక్తి -బెలగాం

పార్వతీపురం గిరిజన బాలికల కళాశాల వసతి గృహంలో ఉంటూ డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్న గిరిజన విద్యారిని కిల్లక స్వాతి మృతిపై సమగ్ర విచారణ జరిపించాలని గిరిజన సంక్షేమ సంఘం నాయకులు పాలక రంజిత్ కుమార్ కోరారు. ఈ మేరకు విద్యార్థిని తండ్రి కిల్లక సోములు, కుటుంబ సభ్యులతో కలిసి ఐటిడిఎ పిఒ విష్ణుచరణ్‌కు వినతిని అందజేశారు. ఈ సందర్భంగా రంజిత్‌కుమార్, కిల్లక సోములు మాట్లాడుతూ శనివారం సాయంత్రం తమ ఇంటికి వచ్చిందని, ఎందుకు వచ్చాయవని అడిగితే మందులు కోసం వచ్చినట్టు చెప్పిందని తెలిపారు. అదేరోజు రాత్రి 7గంటలకు తల్లిని పిలిచి తాను ఏదో మందు తాగేసినట్లు తెలపగా వెంటనే కురుపాం ఆసుపత్రికి తరలించామని, ఆదివారం తెల్లవారుజామున స్వాతి మృతి చెందినటు తెలిపారు. హఠాత్తుగా జరిగిన ఈ పరిణామం పై తమకు అనుమానం కలుగుతోందని, వసతి గృహంలో ఏదైనా సంఘటన జరిగి ఉంటుందని, ఆ కోణంలో విచారణ జరిపించాలని కోరారు. పిఒ మాట్లాడుతూ ఎఎస్‌పి విచారణలో పాటు, శాఖా పరమైన విచారణ జరిపిస్తామని తెలిపారు.

ప్రజల బాధలు పట్టించుకోవాలి

కురుపాం: కురుపాం ప్రజల బాధలను ఆర్అండ్‌బి అధికారులు పట్టించుకోవాలని ఎపి ఆదివాసి వికాస పరిషత్ జిల్లా ప్రధాన కార్యదర్శి పువ్వల సత్యనారాయణ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన పత్రికా విలేకరులతో మాట్లాడుతూ రహదారి విస్తరణ కార్యక్రమంలో భాగంగా తోటపల్లి నుండి కురుపాం దూళికేశ్వర ఆలయం వరకు 9 మీటర్ల చొప్పున విస్తరణ పనులు చేసి రహదారి నిర్మాణ పనులు కూడా పూర్తయ్యావని కానీ ఎక్కువ రద్దీగా ఉన్న నియోజకవర్గ కేంద్రమైన కురుపాంలో ఏడు మీటర్లు చొప్పున ఎందుకు తీశారో అర్థం కావడం లేదన్నారు. పోనీ తీశారు సరే ఇప్పటికీ పనులు పూర్తి చేయకుండా అలా ఉండడం వల్ల రోడ్డుపై వర్షాలు పడి గుంతల్లో నీరు నిల్వ ఉండి ప్రజలు అనేక రోగాల బారిన పడుతున్నారని అన్నారు. తక్షణమే కలెక్టర్ స్పందించి రహదారి నిర్మాణ పనులను పూర్తి చేయించి ప్రజల ప్రాణాలను కాపాడాలని కోరారు.

ఖాళీ బిందెలతో నిరసన

ప్రజాశక్తి - కొమరాడ

తాగునీటి సమస్యను పరిష్కారం చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. సోమవారం ఖాళీ బిందెలతో సిపిఎం ఆధ్వర్యంలో కొమరాడ సచివాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం సచివాలయంలో ఉన్న డిజిటల్ అసిస్టెంట్ ఆర్.కళ్యాణ్‌కి వినతి పత్రం అందజేశారు. కొల్లి సాంబమూర్తి, పెంట రవణమ్మ, పెంట లక్ష్మి మాట్లాడుతూ మండల కేంద్రంలో ఎంపిడిఒ కార్యాలయానికి 200 మీటర్ల దూరంలో ఉన్న పాత బిసి కాలనీలో రెండు రజక వీధులు ఉన్నాయని ఈ రజక వీధుల్లో నెల రోజులుగా తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ విషయంపై కనీసం సచివాలయం సిబ్బంది, సంబంధిత అధికారులు పట్టించుకోలేదు ఆవేదన వ్యక్తం చేశారు.


వినతి పత్రాన్ని అందిస్తున్న కొల్లి సాంబమూర్తి

వెంటనే సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని తాగునీటిని అందించాలని కోరారు. సమస్య పరిష్కారం చేయకపోతే రాబోయే రోజులలో పెద్ద ఎత్తున రజక కుటుంబంతో కలిసి సచివాలయం వద్ద ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీ, అనసూయ, భారతి, రవణమ్మ, జయమ్మ, అప్పన్న, వేణు పాల్గొన్నారు.

మోడీ ప్రభుత్వాన్ని గద్దె దింపాలి

ప్రజాశక్తి- పాలకొండ

దేశ ప్రజల ప్రయోజనాలను కాపాడుకోవడానికి మోడీ ప్రభుత్వాన్ని గద్దె దింపాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు పిలుపునిచ్చారు. క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ఈ నెల 9న జరిగే దేశవ్యాప్త ప్రదర్శనలు, మహాధర్నాలను విజయవంతం చేయాలని సోమవారం పాలకొండలో సిఐటియు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత తొమ్మిది ఏళ్ల మోడీ పాలనలో దేశం అప్పుల ఊబిలో కూరుకుపోయిందన్నారు. కార్పొరేట్లకు మేలు చేసే విధానాలు తెచ్చి ప్రజలపై భారాలు మోపిందన్నారు. ఇలాంటి ప్రభుత్వం కొనసాగడం దేశానికి ప్రజలకు క్షేమం కాదన్నారు. అందుకోసమే ఈనెల తొమ్మిదో తేదీన అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో మహా ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ర్యాలీలో వివిధ సంఘాల నాయకులు కాద రాము, పామోటి సంగమేశ, శ్రీదేవి, విమల భాస్కరరావు, సంజీవి, సురేష్, జై రాము, హరిబాబు, ఎన్.వంశీ, కె.సూర్యారావు, టి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న సిఐటియునాయకులు

రావికోన వార్డు సభ్యుని స్థానానికి ఉప ఎన్నిక

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

మండలంలోని రావికోన పంచాయతీ నాలుగో వార్డు స్థానానికి ఈ నెల 19న ఉప ఎన్నికల జరగనున్నట్లు, ఎంపిడిఒ ఎస్. రమేష్ తెలిపారు. పంచాయితీ ఉప ఎన్నికల నిర్వహణకు నోటిఫికేషన్ విడుదలైన దృష్ట్యా ఈనెల 8 నుండి నామినేషన్ స్వీకరణ జరుగుతుందన్నారు. ఈ ఎన్నికల సజావుగా జరిగేందుకు సహకరిస్తామని సర్పంచ్ కర్రక రామ స్వామి తెలిపారు.

పరిశుభ్రంగా ఉండాలి

ప్రజాశక్తి- సాలూరు రూరల్

పాఠశాలలు, వైద్యశాలలు పరిశుభ్రంగా వుండాలని జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు రెడ్డి పద్మావతి అన్నారు. మండలంలోని బాగువలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను ఎంపిపి రాములమ్మ, వైస్ ఎంపిపి రెడ్డి సురేష్ తో కలిసి సోమవారం ఆమె తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రతి ఒక్కరికీ వైద్యం అందేటట్లు, ముఖ్యంగా ఈ వర్షాకాలంలో జ్వరాలు ప్రబలకుండా ముందుగానే గ్రామాలలో ఉన్న స్థానిక వైద్య సిబ్బందితో వైద్య శిబిరాలను నిర్వహించాలని సూచించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు వెళ్లి అక్కడ విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారికి సంబందించిన సమస్యల పరిష్కారం కోసం సంబంధిత అధికారులతో అక్కడి నుండే ఫోన్‌లో మాట్లాడి వారి సమస్యలను పరిష్కరించాలని కోరారు. పాఠశాల ఆవరణను శుభ్రంగా ఉంచుకోవాలని, మొక్కలను నాటలని పాఠశాల ఉపాధ్యాయులకు సూచించారు.

స్పందనకు 108 వినతులు

ప్రజాశక్తి- సీతంపేట

సీతంపేట ఐటిడిఎలో సోమవారం పిఒ కల్పనాకుమారి నిర్వహించిన స్పందనకు 108 వినతులు వచ్చాయి. బడుగూడలో మినీ అంగన్వాడి కేంద్రం ఏర్పాటు చేయాలని, దిగువ మల్లెల గూడకు చెందిన సవర చిన్న బాబు ఏదైనా ఉపాధి కల్పించాలని కోరారు. ఎర్రన్న గూడకు చెందిన సవర మల్లేష్ భాష వాలంటరీ నియమించాలని, పాండ్రకు చెందిన జమ్మి పవర్ విడర్ మంజూరు చేయాలని కోరారు. ముగనగూడకు చెందిన నిమ్మల మహేష్ ఐటిఐలో సీటు ఇప్పించాలని, కొండివలసకు చెందిన రామకుమారి వితంతు పెన్షన్ ఇప్పించాలని వినతులిచ్చారు. ఈ స్పందన కార్యక్రమంలో ఎపిఒ రోషి రెడ్డి, డిడి శ్రీనివాసరావు, ట్రైబల్ వెల్ఫేర్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్ సింహాచలం, డిప్యూటీ డిఎంహెచ్ఒ చిరంజీవి, డిప్యూటీ డిఇఒ లిల్లీరాణి, సిడిపిఒ రంగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వ్యాధి నిరోధక టీకాలు

ప్రజాశక్తి- పార్వతీపురంరూరల్

పశువుల్లో అంటువ్యాధులు ప్రబలకుండా జిల్లా అంతటా టీకా వేసే కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా పశుసంవర్ధకశాఖ ఇన్‌ఛార్జి డిడి రెడ్డి నీలయ్య తెలిపారు. సోమవారం చినబొండపల్లి, ఎమ్మార్‌నగరం, వెంకంపేట, నర్సిపురం, సీతానగరం, గుచ్చిమి ఆర్‌బికె కేంద్రాల పరిధిలోని పశుసంవర్ధక శాఖ పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని తమ పరిధిలోని 209 ఆర్‌బికె కేంద్రాల్లో ఒక్కో కేంద్రానికి రూ.33వేలు విలువచేసే 108 రకాల మందులు, టీకాలు సరఫరా చేశామని, వీటి ద్వారా పశువుల్లో లంప్‌స్కిన్, జబ్బువాపు, గొర్రెల్లో చిటుక, నీలినాలుక వంటి వ్యాధులతోపాటు ఇతర వ్యాధుల నిరోధానికి టీకాల కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం

ప్రజాశక్తి- సీతంపేట

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయమని పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. సోమవారం గిరిజన గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. మండలంలో కడగండి సచివాలయ పరిధిలో గల ఒంద్రుజోల, భుచెంద్రి, సంతవలస, కడగండి వలస, కడగండి, పెద్దవంగర, పెద్దవంగర గూడ గ్రామాలలో ఉన్న అన్ని ఇళ్లకు వెళ్లి ఆయా కుటుంబాలకు ఈ నాలుగేళ్లలో వైసిపి ప్రభుత్వం అందజేసిన సంక్షేమ పథకాలను వివరించారు.మరోసారి తనతో పాటు సిఎం జగన్మోహన్‌రెడ్డిని కూడా ఆశీర్వాదించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి సవర లక్ష్మి, స్థానిక సర్పంచ్ కొండగొర్రి కుమారి, ఎంపిటిసి సవర శాంతి, నాయకులు సవర రాము, కొండగొర్రి చంద్రరావు, సవర తిరుపతి రావు, సచివాలయ సిబ్బంది, గ్రామ వాలంటీర్లు, అధికారులు పాల్గొన్నారు.

గంజాయితో ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి- సాలూరు రూరల్

గంజాయితో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశామని రూరల్ ఎస్ఐ ప్రయోగమూర్తి తెలిపారు. ఒడిస్సా నుండి గంజాయిని తరలిస్తుండగా సారిక పంచాయతీ నేరళ్ల వలస గ్రామ చివర్లో సోమవారం సాలూరు పట్టణానికి చెందిన గౌరీ శంకర్, ఒడిస్సా రాష్ట్రం పొట్టంగి గ్రామానికి చెందిన సుబ్బారావు సేథిలను పట్టుకున్నామన్నారు. వారి వద్ద నుంచి 24కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని వారిని అరెస్టు చేసినట్టు వెల్లడించారు.

పాచిపెంట: మండలంలోని కోనవలస చెక్‌పోస్ట్ వద్ద గంజాయి తరలిస్తున్న ఇద్దరిని పట్టుకున్నట్లు ఎస్ఐ ఫక్రుద్దీన్ తెలిపారు. ఒరిస్సాలోని జైపూర్ నుంచి గంజాయి అక్రమంగా తరలిస్తూ వీరిద్దరూ పటుబడినట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం జగిత్యాల జిల్లాకు బత్తిన చందు, అదే రాష్ట్రం మంచిర్యాలీ జిల్లాకు చెందిన తుమ్మ నాగరాజులు జైపూర్ నుంచి విశాఖపట్నంకు రోడ్డు మార్గంలో సాధారణ ప్రయాణికుల వలె ఆర్‌టిసి బస్సులో ప్రయాణించి విశాఖపట్నం నుంచి రైలు మార్గం ద్వారా హైదరాబాద్ చేరుకొని ఉస్మానియా యూనివర్సిటీ తార్నాక ప్రాంతంలో వీరు గంజాయి అమ్మడానికి అలవాటు పడ్డారు. ఈ నేపథ్యంలో వీరిద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. తహశీల్దార్ సమక్షంలో 13 కిలోల గంజాయిని తూకం వేశారు. సాలూరు రూరల్ సిఐ ధనుంజయరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు

లారీ ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి- పార్వతీపురంరూరల్

కొమరాడ మండలం విక్రాంపురంకు చెందిన దండుపాటి రాము (55) లారీ ఢీకొని మృతి చెందారు. సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. ఆదివారం ఉదయం చేపలు అమ్ముకునేందుకు తన బైక్‌పై కూనేరు వెళ్లి తిరిగి వస్తుండగా, రామభద్రపురం దగ్గర ఎదురుగా వస్తున్న లారీ బలంగా ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డారు. స్పందించిన స్థానికులు మెరుగైన వైద్యం కోసం జిల్లా ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ సోమవారం మరణించినట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై ఔట్‌పోస్టు పోలీసులు వివరాలు నమోదు చేశారు.

ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి - మక్కువ


మండలంలోని కన్నంపేట రైస్‌మిల్ సమీపంలో రెండు వాహనాలు ఢీకొని ఇరువురికి గాయాలయ్యాయి. సోమవారం జరిగిన ఈ సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. మక్కువకు చెందిన తమ్ముడు గోవిందు చిల్లర సామాన్ల కోసం బొబ్బిలి వెళ్లి తిరిగి వస్తుండగా మక్కువ నుండి బొబ్బిలి వెళ్తున్న ఓ వ్యక్తి ఎదురుగా వచ్చి ఢీకొనడంతో ఇరువురికి గాయాలు అయ్యాయి. బొబ్బిలికి చెందిన వ్యక్తి తలపై గాయం కాగా, మక్కువకు చెందిన గోవిందు కాలికి గాయాలయ్యాయి ఇరువుర్ని ఆసుపత్రికి తరలించారు. ఇదిలా ఉండగా ప్రమాదం జరిగిన ప్రాంతం బొబ్బిలి మండలానికి చెందినది కాగా, మక్కువ మండలానికి చెందినదా అన్న విషయం తెలియాల్సి ఉంది.

నేరాలు ఘోరాలు

బాలుడి గొంతుకోసిన అగంతకుడు

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

మండలంలోని ఎల్ఎన్‌పురంలో సోమవారం వేకువ నాలుగంటలకు కాలకృత్యాలు తీర్చుకునేందుకు బయటకు వెళ్లిన పట్నాన నాగరాజు (16) గొంతును గుర్తుతెలియని ఒక ఆగంతకుడు కోసి పరారీ కావడం సంచలనం కలిగింది. ఎవరు, ఎందుకు గాయపరిచారన్న విషయం తెలియాల్సి ఉంది. గాయపడిన బాలుడు కుటుంబీకులు పట్టణంలోని ఒక ప్రైవేటు అసుపత్రికి తరలించగా, వైదులు గాయానికి కుట్లు వేశారు. ఈ ఘటన తెలుసుకున్న రూరల్ ఎస్ఐ సింహాచలం గ్రామానికి వెళ్లి సంఘటన జరిగిన తీరును స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, లోతుగా విచారణ జరుపుతామని తెలిపారు.


తెగిన బాలుడు గొంతు

5325 కిలోల బియ్యం పట్టివేత

ప్రజాశక్తి- సీతంపేట

మండలంలో జామితోట గ్రామంలో వ్యాపారి జామి సంతోష్ కుమార్‌కు చెందిన 5,325 కేజీల పిడిఎస్ బియ్యాన్ని విజిలెన్స్ సిఐ డివివి సతీష్ కుమార్ ఆధ్వర్యంలో మాటువేసి సోమవారం పట్టుకున్నారు. దీనిపై కేసు నమోదు చేశారు. ఈ దాడిలో ఈయనతో పాటు సివిల్ సప్లై డిటి మధుసూదన్ రావు ఉన్నారు.

సారా తరలిస్తున్న వ్యక్తుల అరెస్టు

ప్రజాశక్తి- సాలూరు

పట్టణంలోని బంగారమ్మ కాలనీ దగ్గరలో మోటార్ సైకిల్ పై 20లీటర్ల నాటుసారా ప్యాకెట్లు తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు టౌన్ ఎస్ఐ ఎన్.భాస్కరరావు తెలిపారు. ఒడిశాలోని పొట్టంగి తాలూకా కామరపాడు గ్రామానికి చెందిన వంతల సూరిబాబు, బి.సింహాద్రిలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.